క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లపై శ్రద్ధ పెట్టాలి

వైరా: రాష్ట్రంలో ఎండకి, వానకి ఇబ్బందులు పడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుంటే.. రాష్ట్ర మంత్రులు, అధికారులు అందాల పోటీల నిర్వహణపై శ్రద్ధ కనబర్చడం దురదృష్టకరమని సీపీఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. ఆదివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ సుందరి అందాల పోటీల నిర్వహణపై చేస్తున్న ఖర్చు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పెడితే రైతులకు ఇబ్బందులు తప్పేవన్నారు. కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, నరసయ్య, వెంకటేశ్వరరరావు, కృష్ణమూర్తి, శివాజి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



తల్లాడ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కోడూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా నంబూరి కనకదుర్గ ప్రసాద్, కోశాధికారిగా అనుమోలు సర్వేశ్వరరావు లను లయన్స్‌క్లబ్ సభ్యులు, చార్టెడ్ సభ్యుల అనుమతితో ఎన్నుకుని.. కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, వెంకటనారాయణరెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, తిరుమలరావు, మురళి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల మరమ్మతులకు నిధుల మంజూరు

మధిర: నియోజకవర్గంలోని 31 పశువైద్యశాలల మరమ్మతులకు రూ.82.50 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేసింది.

నియోజకవర్గంలో త్వరలో చేపట్టబోయే ఇందిరమ్మ డెయిరీ పథకం కింద పశువుల పంపిణీ చేయనున్నారు.

మైనార్టీ కళాశాలను సద్వినియోగం చేసుకోండి

సత్తుపల్లిటౌన్: నాణ్యమైన విద్య, వసతి, భోజన సదుపాయాలు కలిగిన ప్రభుత్వ మైనార్టీ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకట్రామయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని వెంగళరావునగర్ మసీద్ వద్ద కళాశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలలో 5నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో చేరేందుకు పేద ముస్లీం మైనార్టీ విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని తెలిపారు.

ఆటో వాలా.. డీలా



ఎర్రుపాలెం ఆటో స్టాండ్‌లో నిలిపిన ఆటోలు

- ఫ్రీ బస్సులతో నష్టపోతున్న ఆటో వాలాలు
- గిరాకీల్లేక.. ఈఎంఐలు కట్టలేక అవస్థలు
- భారంగా కుటుంబ పోషణ
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోవాలాల బతుకులపై గట్టి దెబ్బ కొట్టింది. కోవిడ్–19 వ్యాప్తి క్రమంలో ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి ప్రయాణం చేయడంతో ఆర్థికంగా దెబ్బతిన్న ఆటో కార్మికులకు, ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలుతో మరింతగా ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడ్డట్టయింది. కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నారు.

ఆటో స్టాండ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

మధిర – విజయవాడ ప్రధాన రహదారిలో నిత్యం పల్లెవెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను మధిర ఆర్టీసీ నడుపుతుంది. మండలంలోని బనిగండ్లపాడు, జమలాపురం, మీనవోలు, ఎర్రుపాలెం గ్రామాల్లో ఆటో స్టాండ్‌లున్నాయి. ఒక్క మండలకేంద్రంలోనే నాలుగు చోట్ల ఆటో స్టాండ్‌లున్నాయి. ఇక్కడ నుండి మధిర, జమలాపురం, ఏపీ రాష్ట్రం కంచికచర్ల, జి.కొండూరు గ్రామాలకు ప్రయాణాలు చేస్తుంటారు. ప్రతి ఆటో స్టాండ్‌లో పదుల సంఖ్యలో ఆటో కార్మికులున్నారు.

గిరాకీల్లేక.. ఈఎంఐ కట్టలేక..

తెలంగాణలో ఏ మూలకెళ్లినా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండటంతో ఆటోల్లో ప్రయాణం చేసే వారు గణనీయంగా తగ్గిపోయారు. దీంతో ఆర్థికంగా వారి జీవితాలు చితికిపోతున్నాయి. లక్షలు పెట్టి ఆటోలను ఫైనాన్స్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసిన ఆటో యజమానులు వాటికి ఈఎంఐలు కట్టలేకపోతున్నారు. ఆటో కార్మికులు కొంతమంది పొలాల్లో కూలీలకు కూడా వెళ్తున్నారు. మరికొంతమంది అమ్మేస్తున్నారు.

నెరవేర్చని ప్రభుత్వ హామీ..

ఆటో కార్మికులను ఆదుకుంటామని సంవత్సరానికి రూ.12వేల నగదు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం నేటికి చిల్లిగవ్వ ఇవ్వలేదు. భరోసా ఇచ్చిన ప్రభుత్వం నేడు ఆర్థిక సాయం ఊసే ఎత్తడం లేదని ఆటో కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా తమను పాలకులు ఆదుకోవాలని కోరుతున్నారు.

> **ఆటోలు ఎక్కడం లేదు.**
>
> 
>
> నేను పెగళ్లపాడు గ్రామంలో ఉంటున్నా. గత పదేళ్లుగా ఎర్రుపాలెం మండలకేంద్రం నుంచి మధిరకు ఆటో నడుపుతున్నా. ఉచిత బస్సు ప్రయాణంతో సరిగా ఎవ్వరూ ఆటోలు ఎక్కడం లేదు. ప్రతీ అర గంటకు బస్సు సర్వీసు ఉండడంతో మహిళలు ఆటోలు ఎక్కేందుకు మొగ్గు చూపడం లేదు. కొన్నిసార్లు ఖాళీ జేబుతో ఇంటికెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం సాయమందిస్తే బాగుంటుంది.
>
> – షేక్ జానీపీరా, ఆటో కార్మికుడు, పెగళ్లపాడు

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికురాలికి స్మార్ట్‌ఫోన్‌ను అందజేస్తున్న కండక్టర్ ఉపేందర్

సత్తుపల్లిటౌన్: బస్సులో మర్చిపోయిన స్మార్ట్ ఫోన్‌ను ప్రయాణికురాలికి అప్పగించి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. రేజర్ల గ్రామానికి చెందిన సిరికొండ వెంకటమ్మ ఆదివారం కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. బస్సు సీటులోనే తన రూ.15 వేలు విలువగల స్మార్ట్‌ఫోన్‌ను మర్చిపోయి వెళ్లగా.. గమనించిన కండక్టర్ ఎం.ఉపేందర్ భద్రపరచాడు. విషయం తెలుసుకున్న వెంకటమ్మ ఆర్టీసీ వారిని సంప్రదించగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో వద్ద టీఐ3 ఆనందం సమక్షంలో ఫోన్‌ను అందించారు.

మధిర: ఆర్టీసీ బస్సులో మధిర నుంచి ఖమ్మం వెళ్తున్న సుభాని తన సీటులో బ్యాగును మర్చిపోయి ఇల్లెందు క్రాస్‌రోడ్డులో దిగి వెళ్లాడు. ఖమ్మం వెళ్లిన తరువాత అందరు దిగి వెళ్లే క్రమంలో కండక్టర్ స్వాతి ఆ బ్యాగును గమనించి అందులో ఉన్న మొబైల్ ద్వారా ప్రయాణికుడికి సమాచారం అందించగా.. ఆయన ఇల్లెందు క్రాస్‌రోడ్డుకు వచ్చి ప్రయాణికుల సమక్షంలో బ్యాగును తీసుకుని ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

మినీ స్టేడియాన్ని సందర్శించిన పొంగులేటి మాధురి



పిల్లలతో మాట్లాడుతున్న పొంగులేటి మాధురి

కల్లూరు: కల్లూరులోని మినీ స్టేడియం ప్రాంగణాన్ని ఆదివారం సాయంత్రం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి సతీమణి పొంగులేటి మాధురి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న చిన్న పిల్లలతో ముచ్చటించారు. స్టేడియం అడ్మినిస్ట్రేటర్ పసుపులేటి వీరరాఘవయ్య, చిన్న పిల్లలు స్టేడియం ప్రాంగణంలో చిన్న పిల్లలపార్క్, ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని మాధురిని కోరారు. దీంతో స్పందించిన ఆమె పిల్లలకు కావాల్సిన స్ప్రింగ్‌బోర్డ్, రోటేటింగ్ రల్స్, ఇతర ఆట వస్తువులు ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి నిధుల ద్వారా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు, వాకర్స్ హర్షం వ్యక్తం చేసారు. పొంగులేటి మాధురికి జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి తుంబూరు సునీల్ రెడ్డి, స్టేడియం ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, షటిల్ కోచ్ తల్లపురెడ్డి గౌతమ్‌రెడ్డి, కబడ్డీ కోచ్ శ్రీనివాస్, అథ్లెటిక్స్ ట్రైనర్ నల్లగట్ల నాగబాబు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

జలబిందెల ఊరేగింపులో..

ముదిగొండ: మండల పరిధిలోని వల్లబిలో జలబిందెల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించగా.. మహిళలు జలబిందెలతో కంఠమహేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి సతీమణి మాధురి పాల్గొన్నారు. మహిళలు బోనాల జాతర నిర్వహించారు. కంఠమహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

గత ప్రభుత్వ పాలనలోనే సంతోషం



మాట్లాడుతున్న ఏపీ మాజీ మంత్రి జోగి రమేష్

పెనుబల్లి: గత ప్రభుత్వాల పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని ఏపీ మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెనుబల్లిలోని ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం నాయకుడు కోటగిరి సుధాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్, తెలంగాణలో కేసీఆర్ మరల సీఎం కావాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకుడు కోటగిరి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: ఈ నెల 24న వైరాలో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కేజీ సిరిపురంలో మచ్చా వెంకటేశ్వరరావు(బుజ్జి) ఆయిల్ పామ్ తోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మొదటిసారి నిర్వహిస్తున్న జాబ్‌మేళాను విజయవంతం చేయాలని, భట్టి హామీ మేరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు వెంకట నర్సిరెడ్డి, నారాయణరావు, చంద్రప్రకాశ్, మంగీలాల్‌నాయక్, స్వర్ణ నరేందర్, పీసీసీ కార్యదరి సత్యనారాయణ, పుల _య్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



భీమవరంలో పార్టీలోకి చేరినవారికి కండువాలు వేసిన పొన్నం వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని భీమవరం గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకోవడం సరికాదన్నారు. పలు పార్టీల నుంచి సీపీఎంలోకి చేరిన పలువురికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మాదినేని రమేష్, మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, నాయకులు తదితరులున్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కతోలిక చర్చిల్లో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు జోజేబాబు బోధిస్తూ ఒకరు నొకరు ప్రేమించుకోవాలని పరస్పరం ఇరుదేశాల మధ్య ప్రేమ కలిగి ఉన్నచో దీనిని బట్టి ఐక్యత ఉంటుందని, మానవ సమాజంలో అందరూ ఐక్యంగా జీవిస్తూ ఉండాలని కోరారు. పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, టి.వెంకటాపురం, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, కిష్టారం తదితర గ్రామాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కన్యాస్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ అందుకున్న వైదేహి

ఏన్కూరు: మండల పరిధిలోని తూతుక్క లింగన్న పేటకు చెందిన కట్టా వైదేహి మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద చేతుల మీదుగా గోల్డు మెడల్ అందుకుంది. భగవద్గీత కంఠస్థ పోటీల్లో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలకు సంబంధించి నిర్వహించిన ఆన్‌లైన్ కంఠస్త పోటీల్లో నెగ్గిన వైదేహి గోల్డు మెడల్ సాధించింది. ఈ మేరకు ఆదివారం మైసూరులో సచ్చిదానం స్వామి చేతుల మీదుగా అవార్డును అందుకుంది. గోల్డు మెడల్ సాధించిన ఆమెను స్థానికులు, పలువురు అభినందించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీలు ఎన్నిక

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, తక్కెళ్లపాడు, సఖినవీడు, ములుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఆదివారం రాత్రి ఆపార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, క్లస్టర్ ఇంచార్జి కడియం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నిక చేశారు. తక్కెళ్లపాడు గ్రామశాఖ అధ్యక్షుడిగా ముంగి ఓబయ్య ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందించారు. పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, రామకృష్టారెడ్డి, తిరుపతమ్మ, నాగిరెడ్డి, పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా పెద్దప్రోలు సైదులు, ఉపాధ్యక్షుడిగా తాటికొండ ఇజ్రాయేలు ఎన్నికయ్యారు. ఆదివారం మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, క్లస్టర్ కోఆర్డినేటర్ కర్నాటి రామ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామారావు, మాజీ సర్పంచ్ బాబు, సొసైటీ ఉపాధ్యక్షులు రాఘవ రావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మధిర/ముదిగొండ/కల్లూరు: మధిర పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో, ముదిగొండ జెడ్పీ పాఠశాలలో, కల్లూరులోని జెడ్పీఎస్ఎస్ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 20 నుంచి 24వ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వై.ప్రభాకర్, రమణయ్య, పత్తిపాటి నివేదిత తెలిపారు. ఆదివారం మధిరలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రాథమిక స్థాయి, ఉపాధ్యాయ వృత్యంత శిక్షణపై రిసోర్స్ పర్సన్లతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. ఈ శిక్షణ ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉటుందని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులందరికీ మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయం ఉంటుందన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు జమీర్, రఫీ, నరసింహారావు, విశ్వనాథం, మహేందర్, మహ్మద్, రాజు, స్నేహిత పాల్గొన్నారు.



సూర్యతండాలో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



బొక్కలతండాలో.. విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడిన గేదెలు (ఫైల్)

తీగలు చేతికందుతున్నాయ్..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- తెగిపడుతున్న విద్యుత్ తీగలు
- బలైపోతున్న మూగ జీవాలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

కారేపల్లి: ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. మూగ జీవాలపాలిట శాపంగా మారింది. ఎత్తు తక్కువలో ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, గాలి దుమారం వచ్చినప్పుడు కుప్పకూలిపోతున్న విద్యుత్ స్తంభాలు, మరమ్మతులు చేపట్టే క్రమంలో విద్యుత్ శాఖ అధికారుల అలసత్వం.. వెరసి మండలంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మేతకు అటుగా వెళ్లిన మూగజీవాలు విద్యుద్ఘాతాలకు గురై మృత్యువాత పడుతున్నాయి.

మండలంలోని వివరాలిలా..

సింగరేణి మండలంలో 3 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. కారేపల్లిక్రాస్‌రోడ్డు, చీమలపాడు, భాగ్యనగర్‌తండా సబ్‌స్టేషన్‌ల పరిధిలో.. వ్యవసాయ బావుల కింద 4619 విద్యుత్ మీటర్లు ఉన్నాయి. కాగా, పాత విద్యుత్ స్తంభాలు మార్చకపోవటం, గాలి దుమారాలకు విద్యుత్ తీగలు కింది వేలాడుతుంటంతో పాటు, పలు సందర్భాల్లో తీగలు తెగి కిందపడటం, స్తంభాలు కూలిపోవటం వంటి ఘటనలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి.

తూ తూ మంత్రంగా మరమ్మతులు..


ఎదైనా మరమ్మతులకు గురైన సందర్భాల్లో విద్యుత్ సిబ్బంది తూతూ మంత్రంగా పనులు చేపట్టి చూతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు ఎత్తు తక్కువలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయటంతో.. అటుగా మేతకు వెళ్లిన పశువులు విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడుతున్నాయి. గాలి దుమారాలు వచ్చిన సందర్భాల్లో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి దుక్కిటెడ్లు, గేదెలు మృత్యువాత పడుతున్నాయి.


దీంతో రైతులు తమకు జీవనాధారమైన వ్యవసాయంలో సహాయపడే దుక్కిటెడ్లు, పాడిగేదెలు చనిపోతుండటంతో తీవ్రంగా నష్టపోవాలిసన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని...

- బొక్కలతండా గ్రామంలో ఇటీవల వీచిన గాలి దుమారానికి పొలాలు, చేలల్లోని విద్యుత్ తీగలు తెగిపడటం, విద్యుత్‌శాఖ అధికారులు సరఫరా నిలిపివేయక పోవటంతో మేతకు అటుగా వెళ్లిన 5గేదెలు తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి.
- అప్పాయిగూడెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుతక్కువలో ఏర్పాటు చేయటంతో అటుగా వెళ్లిన ఒక దుక్కిటెద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది.
- నానునగర్‌తండా గ్రామంలో గాలిదుమారానికి విద్యుత్ స్తంభం పై ఇన్సులేటర్ పగిలిపోయి విద్యుత్ తీగలు కిందపడటం, అధికారులు సరఫరా నిలపక పోవడంతో అటుగా మేతకు వెళ్లిన రెండు దుక్కిటెడ్లు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి.
- చంద్రళ్లగూడెం గ్రామంలో ఇటీవల వీచిన గాలి దుమారానికి విద్యుత్ తీగ తెగిపడటంతో.. ఒక దుక్కిటెద్దు మేతకు వెళ్లి విద్యుద్ఘాతంతో మృత్యువాత పడింది.

ఇప్పటికైనా.. సంబంధిత అధికారులు స్పందించి గాలి దుమారం వీచిన సందర్భంలో విద్యుత్ లైన్లు పరిశీలించటంతో పాటు, ఎత్తుతక్కువ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎత్తు ఎక్కువలో ఏర్పాటు చేయటం, కాలం చెల్లిన, ఒరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

> **పోస్టులు ఖాళీగా ఉన్నాయి..**
>
> 
>
> కారేపల్లి టౌన్‌లో లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, విశ్వనాథపల్లిలో అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయినా.. విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం. ఎత్తుతక్కువలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కిందికి వ్రేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయటం, విద్యుత్ తీగల వెంబటి ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులను ఎప్పటికప్పుడు చేపడుతున్నాం.
>
> – సుధాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, కారేపల్లి

> **ఎత్తులో ఏర్పాటు చేయాలి..**
>
> 
>
> విద్యుత్ శాఖ అధికారులు చొరవ చూపి.. ట్రాన్స్‌ఫార్మర్లను పశువులకు అందకుండా ఎత్తులో ఏర్పాటు చేయాలి. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయటంతో పాటు, చేలల్లోని ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేయాలి. లేదంటే.. మేతకు వెళ్లిన మూగజీవాలు మృత్యువాత పడి తీవ్ర నష్టాన్ని మిగిల్చుతున్నాయి.
>
> – ముండ్ల ఏకాంబరం, రైతు , కారేపల్లి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి..

మధిర: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. మండలంలోని ఆదివారం దెందుకూరు, ఖమ్మంపాడు, చిలుకూరు గ్రామాల్లో సమావేశాలను నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, రామయ్య, రామారావు, వెంకటకృష్ణ, వెంకయ్య బాబు, సంధ్య, రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి అండ..



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అండ అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ముదిగొండలోని మాజీ జెడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు నివాసంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రమేష్‌బాబు, మధిర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

నివాళి..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్య అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కిష్టారంలో ఆదివారం మామిళ్లపల్లి కృష్ణయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శంకర్‌రావు, వేణు, నరేంద్ర, అప్పారావు, రాధాకృష్ణ, మధు, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం..



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పది చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా.. ఒకరినొకరు పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హై స్కూల్‌లో మంచి మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులకు ప్రతి ఏటా బహుమతులు అందజేయాలని నిర్ణయించుకున్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి..



ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తుందని, మతవాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగార్జున్, కోటేశ్వరరావు, సతీష్, హరీష్, రమేష్, సైదేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పుల్లారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

చింతకాని: సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేరడ గ్రామంలో ఏఐవైఎఫ్ గ్రామశాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకలాపాల్లో యువకులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షేక్ నాగుల్‌మీరా, కార్యదర్శిగా గోగుల వెంకన్న లతో పాటు మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిళ్లపల్లి ఏసు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షులు అబ్బూరి మహేష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆదర్శం సుందరయ్య జీవితం

బోనకల్: అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం దేశంలో అన్ని వర్గాలకి ఆదర్శమని సీపీఎం జిల్లా నాయకుడు బండారు రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో ఆదివారం నిర్వహించిన స్టడీ సర్కిల్ విభాగంలో పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రను బండారు రమేష్ వివరించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య జీవిత చరిత్ర పార్టీ విశిష్టత అనే పాఠాన్ని బండారు రమేష్ బోధించారు. సుందరయ్య చిత్రపటాన్ని, ఆయన రచనల సంకలనం అనే పుస్తకాన్ని బండారు రమేష్ అప్పాచారికి అందజేశారు. నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నరేష్, సత్యనారాయణ, రమేష్, సునీత, రామారావు తదితరులున్నారు.